...............

"సార్"

"సార్"

ఈ పిలుపుకు మెలుకువ వచ్చింది. పిలుపు అస్పష్టంగా ఉంది.

ఎవరూ ?

"నేనేసార్, ఎల్లయ్యను".

ఇంత రాత్రి మా స్కూల్ ప్యూన్ ఎందుకొచ్చాడబ్బా! అనుకుంటు తలుపు తీశాను.

"హైండ్సప్. కదులితే కాల్చేస్తా"

ఇద్దరు పోలీసు ఆఫీసర్లు పిస్టళ్ళను నాకు గురిచూపుతూ సిద్ధంగాఉన్నారు. దాదాపు పదిమంది పోలీసు కానిస్టేబుల్స్ తుపాకులను నావైపు చూపుతూ పొజిషన్‌లోవున్నారు. ఇంటిముందర కరెంటు లైటు వెలుగులో వీళ్ళని చూసి ఒక క్షణం ఆశ్చర్యపోయాను. నేను ఏంచేశానని వీరందరు ఇంతరాత్రి నన్ను అరెస్టుచేసేందుకు వచ్చారో అర్థంకాలేదు. నన్ను పిలిచిన మా ప్యూన్ వారివెనుక బిక్కు బిక్కుమంటూ నిలుచున్నాడు.

"నీ పేరేంది ?"

సత్యనారాయణ

"నువ్ మాతో పోలీస్ స్టేషన్‌కు నడువ్"

ఎందుకు ?

నా మాట పూర్తికాకముందే చెంప చెళ్ళుమంది.

"డోంటాక్ బ్లడీ బ్లాస్టెర్డ్"

నలుగురు కానిస్టేబుల్స్ మా ఇంటిలోకి పరుగెత్తి పుస్తకాల మూటలు తెచ్చారు.

ఈ తతంగానికి మెలుకువ వచ్చిన మా అమ్మ, నా భార్య నా దగ్గరకువచ్చిచేరారు ఈ దృశ్యం చూసిన మా అమ్మ బావురుమంటూ నన్ను చుట్టేసింది.

"పద" పోలీసు ఆఫీసర్ హుకుం జారీచేశాడు.

ఇంతలో ఎక్కడనుండో పోలీసువ్యాను వచ్చి ఆగింది.

"పాంట్, షర్ట్ వేసుకునివస్తా" అతన్ని అడిగాను. అంతవరకు బంగీమీదనే వున్నా.

అతను నా భార్యను తెమ్మని చెప్పాడు.

వారు ఆ గుడ్డలు చెక్ చేసినతరువాత అంతమందిముందే వేసుకోవలసి వచ్చింది.

"ఊఁ" ఆ ఆఫీసర్ గద్దించాడు.

ఆ గద్దింపుకు జవాబుగా నా చేతికి బేడీలు వేశారు.

ఒకడు మా అమ్మను బలవంతంగా ప్రక్కకు నెట్టాడు.

ఇంకొకడు నన్ను బలవంతంగా వ్యానులోకి తోశాడు.

"నా కొడుకును యెందుకు తీసుకపోతాండ్లు?" ఆక్షణం ఏడుపు ఆపి అమ్మ ప్రశ్నించింది.

అందుకు సమాధానంగా వ్యాన్ శబ్దం చేసింది.

దీనికి మేము సాక్ష్యమంటూ వీధికుక్కలు మొరిగినవి.

అన్యాయాలు, అక్రమాలు విచ్చలవిడిగా జరుపుకొమ్మన్నట్లు రాత్రి తనచీకటి రూపాన్ని అంతటా విస్తరింపచేసింది. 'మీ ఆటలు ఎంతోకాలం సాగవు, తూర్పు వెలుగు వచ్చేవరకైన మేము ప్రతిఘటిస్తాం అన్నట్లు పగిలిపోగా మిగిలిన వీధిదీపాలు. వ్యాన్ ముందుకు పరుగెత్తింది. నా ఆలోచనలు వెనుకకు పరిగెత్తినవి.

"దిగు"

ఆలోచనలనుండి తేరుకొని చూశాను. పోలీసు స్టేషన్ గోడగడియారం మూడు కొట్టింది.

"వీన్ని లోపలెయ్"

నన్ను లాకప్‌లోకి తోసేశారు.

అప్పటికే అందులో ఇద్దరు నిదురపోతున్నారు. గది చాలా ఇరుకుగా వుంది. లాకప్ ముందర సెంట్రీ తిరుగుతున్నాడు. ఆఫీసర్ ఫోన్‌లో ఏదో మాట్లాడుతున్నాడు. మా గదికి దగ్గర్లో లేట్రిన్ ఉన్నట్లుంది. కంపుగాలి వస్తోంది. అదేవిషయం సెంట్రీతో చెప్పాను.

"చుప్‌బే" అంటూ ఉరిమాడు.

ఉపాధ్యాయులు బహుముఖ ప్రజ్ఞులని, భావిభారతజాతి నిర్మాతలని గొప్పగొప్ప నాయకులు, గొప్ప గొప్ప సభల్లో, గొప్ప గొప్ప ఉపన్యాసాలు దంచేస్తారు. కాని ఉపాధ్యాయుడు ఈ సమాజంలో ఎంతో తక్కువ స్థానంలో ఉన్నాడని అర్థం చేసుకున్నాను.

ఒక్క క్షణం నాకుటుంబం గుర్తుకు వచ్చింది. రక్తపుపోటుతో మంచాన పడ్డ అమ్మమ్మ పెప్టిక్ అల్సర్‌తో బాధపడే అమ్మ, ఛాతీనొప్పితో ఉన్న తమ్ముడు, పెండ్లి

కావలసిన ఇరువదిమూడేండ్ల చెల్లెలు, చదువుకునే తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, పాలుమరువని పసివాడు, నేనులేనిదే ఒక్కరోజుగూడ గడుపలేని మా పెద్దబాబు. సుఖమంటేఏమిటో తెలియక గానుగెద్దులా ఈ ఇంటికి చాకిరీచేసే నా భార్య వచ్చే జీతపురాళ్ళకి తోడుగా ఎన్ని ట్యూషన్లు చెప్పినా వెళ్ళని మాకుటుంబపరిస్థితి ముందు ఏమవుతుందో ఆలోచించ లేకపోయాను. 'దీనికై నీవు చేసేదింతే' అంటూ నా నిస్సహాయతను గేలిచేస్తూ రెండు కన్నీటిబొట్లు రాలినవి.

"ఇప్పుడే వచ్చినవా?" పక్కన ఉన్నతడు పలుకరించాడు.

ఊఁ

"నిన్ను ఎందుకు తీసుక వచ్చిండ్లు?"

ఏమో

"ఒక్క బీడుంటియ్యకపోతివి"

నేను తాగ.

"మూరోజులాయె నన్ను యిందులోవేసి. ఒక్క పైసలేదు. బీడీలకు బలు విబ్బందయితాంది. ఒక్క పావులుంటియ్యవా".

పావుల ఇచ్చాను.

సెంట్రీని పిలిచి పావుల ఇచ్చాడు.

అతను ఇతనికి రెండు బీడీలిచ్చాడు.

బీడీలు చూసి బహు సంతోషపడ్డాడు,

'నీ పేరేంటి?'

"బాలిగాడు దొర"

'నిన్నెందుకు తీసుక వచ్చారు?'

"మొన్నప్యాటకు జొన్నలెత్తచ్చింటి" బీడి ముట్టించి ఒక దమ్ము లాగి 'అరె, అచేటు పండు' అని పక్కవాన్నని నాతో తన కథ మొదలుపెట్టాడు.

"జొన్నలమ్మినంక శెత్రితెచ్చుకుందామని దుకాండ్లకుపోయిన దుకానవోడు దర గిట్టనియ్యలె. వచ్చేది వానకాలమాయె, అక్కరుంటదని ఆలోచిత్తాన. ఇంతట్లో దుకాండ్లకెల్లి ఎవడో వచ్చి 'గీవీడే మొన్న వచ్చి శత్రి దెంగిపోయిండ'ని నన్ను యీ పోలీసులకు పట్టిచ్చిండు.

'మరి వీళ్లేంజేసిండ్లు?'

"నా రూపాలు గుంజుకొని దీంట్లేసిండ్లు"

717

'అసికాదు నేనడిగేది, నువ్ ఈ విషయం చెపితే ఏమంటరు?'

"ఇంక రెండువందలు తెమ్మంటాండ్లు" అని భోరున ఏడుస్తూ తనను కొట్టిన దెబ్బలు చూపించాడు.

"ఏయ్, ఊకె ఏడ్వేనా?"అంటూ పక్కకతను లేచాడు.

"ఏది ఒక్కదమ్ముటీయ్"అంటూ బీడీ తీసుకొని తనోరెండు దమ్ములులాగి బీడీ బయట పడేశాడు.

"ఈయ్నెవలు?" అతను బాలిగాన్నడిగిండు.

"ఏమో, ఇప్పుడే వచ్చిండీయన"

నా విషయం వారితో చెప్పాను.

అతనిగూర్చి గూడ అడిగాను.

అతని పేరు రమేష్, విజయవాడ. ఇంటర్ మీడియట్ పాసైండు. పినతల్లి తిడితె ఇంటిలో చోటులేక ఉద్యోగానికై ఇటు వచ్చాడు- స్టేషన్లో పడుకుంటే మూడు రోజులకిత్రం పోలీసులు ఏమీ యిచ్చుకోలేక పోయాడు కాబట్టి 'ఆవారా' అని ఇందులో పడేశారు–

లాకప్గది మూలలో ఒక రంధ్రంవద్ద వాళ్ళుమూత్రం పోశారు. 'ఇదేంటంటే' ఇప్పుడు లాకప్ తీయ్యరన్నరు.

వారు తిరిగి నిద్రలోకి జారారు.

నా భావి కార్యక్రమంగూర్చి యింకా ఏమీ ఆలోచించలేక పోయాను.

గడియారం ఐదు కొట్టింది.

సెంట్రీతో దొడ్డికిపోవాలని చెప్పాను.

ఎస్సైసాబ్ రానిదే తలుపుతియ్య నన్నాడు.

ఎంత ప్రాధేయపడ్డా తిట్లుతప్ప అతని నోటినుండి మరోటి వినలేక పోయాను.

ఇంతలో టక టక బూట్లశబ్దం వినిపించింది.

వచ్చేసి ఎస్సైని అని చూశాను. కాని దాదాపు ఇరవయి సంవత్సరాల యువకుణ్ణి లాక్కొచ్చి బట్టలూడదీసి అమానుషంగా కొట్టారు. చిమ్మెరక్తంతో లేవలేక పోయాడు. ఒక పోలీసు అతన్ని బూటుకాలితో తన్ని లేపాడు.

"నడువ్ సాలే" అంటూ మరి రెండు తన్నాడు.

రక్తంతో దిగంబరంగా ఉన్న ఆ యువకుడు "దూప" అంటూ మూల్గిండు,

718

"బాద్ మే దే" అంటూ మేమున్న లాకప్‌లో పడేశారు.

'తన బట్టలివ్వమన్నట్లు' పోలీసులకు సైగ చేశాడు.

వారు చువ్వల మధ్యనుండి బట్టలు లోపల పడేశారు. అతి కష్టంమీద బట్టలు తొడుక్కో-గలిగాడు.

ఒక బీడీ ఉ-౦టె ఇవ్వరా అన్నట్లు మా ముగ్గురివైపు చూశాడు. బాలిగాడు బీడి ముట్టిస్తే, తలో రెండు దమ్ములు తాగారు.

ఎంతో ప్రాధేయపడగా గ్లాసెడు నీళ్ళు ఇచ్చారు. ఆ దెబ్బలుతిన్న వ్యక్తి అవి తాగి కొంత కుదుటపడ్డాడు.

మళ్ళీ టకటక బూట్ల శబ్దం.

మరెవరిదో వీపు పగిలిందనుకొన్నాను.

కాని ముగ్గురు పోలీసు ఆఫీసర్లు లాకప్ ముందుకొచ్చారు, నన్ను బయటికితీశారు.

నేను కోరగా అతి పకడ్బంది ఏర్పాట్లతో నన్ను కాలకృత్యాలు తీర్చుకోనిచ్చారు.

తరువాత నన్ను వ్యాన్లో ఎక్కమన్నారు. నా చుట్టూ సాయుధ రిజర్వుడ్ పోలీసులు- ముందర ముగ్గురు ఆఫీసర్లు- వ్యాన్ కదిలింది.

"ఇన్ని రోజులు మన కన్నుగప్పి బయట పడకుండ ఉన్నది వీడే"

"ఎస్సార్, ఎమర్జన్సీపెట్టంగనే ముఖ్యులందర్నీ అరెస్టుచేశాము, అయినా సిటీలో ఆర్గనైజేషన్ సాగుతుందంటే కారణం వీడేసార్."

"వీడొక్క-డే కాదు, మనం అరెస్టు చేసిన వాళ్ళలో కూడ కొందరున్నారు. వీళ్ళందరూ కలిసి యూత్‌ను చెడగొడుతున్నారు."

"వీడు ముఖ్యంగా స్టూడెంట్సును చెడగొడుతున్నాడు."

"..............."

"..............."

ఈ రకంగా సాగింది వారి సంభాషణ.

వీరు నాగూర్చే మాట్లాడుతున్నారని, నాకంటె ముందుగా మరికొందరిని అరెస్టు చేసి కాన్‌సెంట్రేషన్ క్యాంపులో ఉంచారని అర్థంచేసుకున్నా. అందుకే వీరు నన్ను ఏమి చేయబోతున్నారో, నేను ఎలా ప్రవర్తించాలో ఆలోచిస్తున్నా. వ్యాన్ కారడవిలో ఒక పెద్ద బంగ్లా చేరుకుంది దాదాపు వందమంది వరకు రిజర్వుడ్ పోలీసులు అక్క-డున్నారు.

నేను వ్యాన్ దిగగానే, నన్ను ఒక పెద్ద పుస్తకాల మూట మోయమన్నారు-తప్పలేదు.

నేను హాల్లోకి రాగానే అక్కడ పుస్తకాల చుట్టూవున్న ఆఫీసర్ల కళ్ళు పిస్టల్స్ లాగా ఒక్కసారి నావైపు తిరిగినవి.

"హి యీజ్ ద బగ్గర్" ఒక ఆఫీసర్ నన్నుచూసి రిమార్కు చేశాడు.

"వీన్ని ఎక్కడుంచుమంటారు ?"

"ఇంతలో వీని ఫొటోలు, ఫింగర్ ప్రింట్స్ తీసుకోండి" పెద్దాఫీసర్ చిన్నాఫీసర్‌కు హుకుం జారీచేశాడు. గబగబ వారాపని పూర్తి చేశారు.

"నువ్ ఖర్చులేకుండా ఫోటో దిగుతానవ్‌రా" వారు నా ఫోటోగ్రాఫ్ తీసుకునే సందర్భంలో ఒక ఆఫీసర్ జోక్. అందుకు అక్కడి పోలీసు బలగం పగలబడి నవ్వింది. తరువాత నాచేత నాకు ఏదో స్వంత పని ఉన్నట్లు వారం రోజులకు లీవ్ లెటర్ రాయించారు.

ఒక కానిస్టేబుల్ వచ్చి నన్ను పైకి తీసుకెళ్ళాడు.

పైన ఐదారుగురు ఆఫీసర్లు టేబుల్‌చుట్టూ కూర్చున్నారు. మరో ఆఫీసర్ కాస్త ఎడంగా కూచునిఉన్నాడు. మరొకతను స్టేట్‌మెంట్స్‌రాసుకోటానికి సిద్ధంగాఉన్నాడు.

"నీ పేరేంది ?" ఎడంగా కూర్చున్న ఆఫీసర్ ప్రశ్నించాడు.

చెప్పినా.

"నీ మరో పేరేంది ?"

నాకు ఒకటే పేరు.

"నీవు ఏంపని చేస్తావు ?"

చెప్పినా.

"ఎక్కడ"

చెప్పినా.

వారికి ఉన్న ఇన్‌ఫర్‌మేషన్‌తో సరిపోయినట్లుంది. ఎవరికో సైగ చేశాడు.

ఇద్దరు కానిస్టేబుల్స్ నన్ను బలవంతంగా రూంలోకి లాక్కెళ్ళారు. అందులో మరో నలుగురున్నారు. నన్ను బోర్లపడుకోబెట్టి, మోకాళ్ళలో రోకలిపెట్టి కాళ్ళు మీదికి మలచి ఇద్దరు మీద కూర్చున్నారు. ఇద్దరు పాదాలపై కర్రలతో కొట్టసాగారు. అప్పటి నా బాధను మాటలలో వర్ణించలేను. అప్పుడు నాకు అర్థమయింది లాకప్‌లో దెబ్బలు పడ్డవాని బాధ.

720

"ఇక పటాయింది" ఆ మాటే నా పాలిటి వరమయింది.

నిలబడలేని నన్ను ఇద్దరు కానిస్టేబుల్స్ బయటికి లాక్కెళ్ళి గోడకు దగ్గరగా నిలబెట్టారు.

అన్యాయం తనదాక వస్తేకాని అర్థంకాదు. ఆ క్షణం వారందరూ పరమ కిరాతకులుగా కనపడ్డారు.

"ఇప్పుడు చెప్పు" ఆ ఇంటరాగేషన్ చేసే పోలీసుఆఫీసర్ చిరునవ్వులుచిందిస్తూ అన్నాడు.

"ఏం చెప్పాలి"

"ఏం తెలియనట్లు మాట్లాడి అనవసరంగా తన్నులు తినకు. చెప్పరా లంజ కొడుక చెప్" ముఖం కుమ్ములపెట్టిన వంకాయ అయినట్లయింది.

మా కుటుంబ పరిస్థితి, నేను చేసే ఉద్యోగం గూర్చి చెప్పాను.

"అతితెలివిగా మాట్లాడకు" అంటూ చెంప ఛెళ్ళుమనిపించాడు. ఆ దెబ్బకు ప్రక్కకు తూలాను. ఆ ప్రక్కగల ఆఫీసర్ నన్ను సరిగా నిలబెట్టాడు.

"నీగూర్చి మావద్ద గల రిపోర్టు చదువుతా విను" అంటూ చదివాడు.

నేను పనిచేసే గ్రామంలో జరిగిన దొంగతనానికి నేను నాయకత్వం వహించానని, ఆ ఊరిలో ఒక గ్రామస్తుని కొట్టానని, తరగతులలో పాఠాలకు బదులు...... యిజమ్ బోధిస్తానని, రాత్రిళ్ళు గుట్టలపై మీటింగులు పెడ్తానని, నన్ను ఎప్పుడూ యు.జి. వాళ్ళు కలుస్తారని, చుట్టుప్రక్కల గ్రామాలలో రహస్య సంఘాలుపెట్టి యువకులను యు.జి.కి పంపుతున్నానని, ఎమర్జెన్సీలో సిటీలో జరిగే అల్లర్లవెనుక నేనే ఉన్నానని, నేను ఒక డ్రామా వేయించానని, దానికి యు జి. వాళ్ళు వచ్చారని సిటీలో గోడల పై నినాదాలు నేనే రాయించానని...... ఆ రిపోర్టు సారాంశం.

"ఇదంతా నిజమే కదా" అంటూ గద్దించాడు.

'కాదు, అందులో ఒకటి మాత్రమే నిజమంటూ' నిదానంగా చెప్పాను.

"ఏంటది. నిజం చెప్పు అబద్ధమాడావో ఈ అడవిలో పిట్టను కాల్చినట్లు కాల్చేస్తా".

"డ్రామాను డైరెక్టు చేశాను"

నా ఈ మాటకు ఆ ఆఫీసర్ సినిమా విలన్‌లా వికటంగా నవ్వాడు. మిగిలిన వారు సుతికలిపారు. నాకు అసహ్యమేసింది.

721

"ఆ డాగ్రిమాకు యు.జి. వాళ్ళు ఎందరొచ్చారు ?"

'వాళ్లెవరో నాకు తెలియదు'

"సరే, నీకు జి.కె. తెలుసా ?"

'తెలియదు'

"యస్. కె. ?"

'తెలియదు'

"వై. బి. ?"

'ఊఁహూఁ'

ఇంకొందరి పేర్లు చదివాడు.

అన్నిటికీ తల అడ్డంగా ఊపాను.

"నీకు ఎవ్వడెరుక లేదా బే" అంటూ ఊహించలేనంత తొందరగా కడుపులో బూటు కాలితో తన్నాడు. ఆ తన్నుకు క్రింద పడి సుళ్ళు తిరిగి పోయాను.

కిందపడ్డ నన్ను ఇద్దరు కానిస్టేబుల్స్ లేపి నిలబెట్టారు. నిలబడలేక కూలపడి పోయా-

"ఈ లంజ్డికొడుకు డ్రామా డైరెక్టర్- వీనికి యాక్షన్స్ బాగా వచ్చు. ఇది యాక్షనే- లేవేలే" అంటూ జుట్టుపట్టి లేపాడు పోలీసు ఆఫీసర్.

కళ్ళు చీకట్లు కమ్మాయి. నిలబడలేక పోయాను. అంతే గుర్తుంది.

..........................

ఎప్పటికోగాని స్పృహలోకివచ్చాను. తల దిమ్ముగావుంది కడుపులో నొప్పిగా వుంది. ఒళ్ళంతా పుండు. దగ్గర్లో పెడబొబ్బలు అతికష్టంగా కళ్లు తెరచాను.

"లేచిండుసార్"

"వాన్నిటు పటారి"

క్రేన్స్‌లా ఇద్దరు కానిస్టేబుల్స్ నాపైవాలి నన్ను లేపారు.

ఎక్కడికి తీసుకపోతున్నారో. అర్థమయింది ఇంతకు ముందున్న దృశ్యమే-

"అరే డాగ్రిమాకు ఎవర్ని ఇన్వైట్ చేశారు?" ప్రశ్నల వర్షం మొదలయింది.

ముగ్గురు వచ్చారు అందులో ఒక్కతనిపేరు గుర్తుంది-

"ఎవ్వడు వాడు?"

'రావ్ సార్'

"వాడు సారారా? హీ యిజ్ ఎ డెకాయిట్" గద్దించాడు.

722

అతడంటే వాళ్ళకి అంత కోపమెందుకో-

'అతడు కాలేజి లెక్చరర్ సార్'

'అంటే, అతనిగూర్చి నీకు అన్నీ తెలుసన్నమాట'

అతను ఈమాట ఎందుకన్నాడో అర్థమయింది-

'అతడు లెక్చరర్ అని మాత్రమే తెలుసు'-

'వాడు చెయ్యబట్టే ఈ డిస్ట్రిక్ట్ ఇట్లా నాశనమయింది. అందుకే వాణ్ణి కాన్స్పిరసికేసులో యిరికించాం' ఆఫీసర్ నిండుగా నవ్వుతూ కుర్చీనుండి లేచాడు.

'యూ మిస్టర్ నారాయన్, యు ఆర్ ఏ టీచర్, మోరోవర్ ఏ గ్రాజ్యువేట్. డోంట్ బి సిల్లీ, ఇఫ్ యు రిపీల్ ఎవ్రిథింగ్, యూ విల్ బి రివార్డెడ్. అదర్వైజ్ యు విల్ బి షాట్ డెడ్, కమాన్ సే కరక్ట్' నావద్దకువచ్చి భుజంపై చెయ్యివేశాడు- ఆ క్షణంలో అతన్ని చూస్తే ఒళ్ళు మండింది. ఇంత నీచమైన చిత్రహింసల మధ్య గుడిలో విగ్రహంలాగా, మందస్మిత వదనంతో ఉన్నందుకు మొహంమీద తిట్టాలని, వాళ్ళ క్రూరచర్యలకు తగు పాఠం చెప్పాలని అనిపించింది. అందుకు ప్రతిఫలం ఏమి అనుభవించాలో నాకు తెలుసు. పన్నెండు మందిగల కుటుంబానికి దిక్కెవ్వరూలేరు. వారు అనాథలవుతారు. దేశంలో కోట్లకొద్ది అనాథలున్న విషయం నాకు తెలియనిది కాదు. వారిలో వీరొక భాగం. వారందరికోసం చెట్టుకు కట్టి కాల్చి చంపబడితే ఆ చావు ఎంత విలువైందో నాకు తెలుసు. కాని అంత ఔన్నత్యానికి ఎదగని నాపైనాకే సిగ్గేసి తలక్రిందికి దించాను-

"వీళ్ళంతా నీకు తెలుసుకదూ?" అంటూ ఆ ఆఫీసర్ పది పేర్లు చదివాడు.

అందులో నాకు ఎవరూ తెలియదంటూ తల అడ్డంగా ఊపాను-

'నువ్ క్లాస్‌లో పాఠాలకు బదులు... ఇజమ్ చెప్తావట'

'లేదు'.

'నువ్ గుట్టలపై మీటింగులు పెట్టావట'

'లేదు'.

'మమ్మలను బుకాయించకు. ఈ విషయాలన్నీ మీ స్టూడెంట్సే యిక్కడ చెప్పారు'-

'నేనెప్పుడట్లా చెయ్యలేదు'

'ఈ లంజకొడుకులకు పుటంవేసినా అక్కరకు రారుసార్. మంచిమాటలు వీరికి పనిజెయ్యవు- లేస్తావడ్తా తంతూనే ఉండాలె' పెద్దాఫీసర్‌తో ఓ చిన్నాఫీసర్ అన్నాడు.

'సరే ఈ రాత్రికి బాగా ఆలోచించుకో. రేపు సరిగా చెప్పు. లేకుంటే, అటు చూడు' అడవివైపు చూపించి "అందులో ఇదివరకు ఎందర్నో కాల్చేసిన అట్లే నిన్ను కాల్చేస్తా. ఇక నువ్ పో" ఆజ్ఞాపించాడు.

నన్ను స్కూల్‌లో అరెస్టుచెయ్యక యింటిలో అర్ధరాత్రి పోలీసులు ఎందుకు అరెస్టు చేశారో యిప్పుడర్థమైంది-

'రా' అంటూ పోలీసు కానిస్టేబుల్ నన్ను ఒక పెద్దగదిలోనికి తోసిపోయాడు- దానిముందర ఇద్దరు సెంట్రీలు తుపాకులతో కాపలా ఉన్నారు- అందులో దాదాపు అరవయి డెబ్బయి మందున్నారు- అందులో నాకు పరిచయమున్నవారున్నారు- వారు నా స్టూడెంట్స్ నేను అందులోకి రాగానే వారు బాధ వ్యక్తంచేశారు-

'లంజకొడుకులు మిమ్ములగూడ పట్టుకచ్చిండ్లా, సార్'

'సార్ పేరు ఎవడు చెప్పిండొచ్చురా?'

'ఇంకెవ్వడు, వాడె మొగిలిగాడు'

'మనరాజ్యం రాదారా, అప్పుడు వాన్ని......' ఒక స్టూడెంటు పళ్లు పటపట కొరికాడు.

'ఇప్పుడవన్నీ ఎందుగ్గని'అంటూ వేరొకతను నేను కూర్చోడానికి స్థలమిచ్చాడు.

వాళ్ళందరు తమకు జరిగింది మెల్లిగా చెప్పారు. మొత్తంమీద నాకు అర్థం అయింది ఇది.

నాకంటె రెండు రోజులముందే వాళ్ళందరినీ ఈ కాన్‌సెంట్రేషన్ క్యాంపుకు తెచ్చారు- అందులో ఎవరినీ విడువకుండా చిత్రహింసలకు గురిచేశారు. అందరికంటే చిన్నవాడు చారి, పదహారుసంవత్సరాల పిల్లోడు- వారి చిత్రహింసలకు జ్వరంవచ్చింది. చూసే దిక్కులేదు- జబ్బుచేస్తే గొడ్డుకైనా కోడిపిల్లకైనా మందిస్తారుకాని ఈ పోలీసులు మనిషిని జంతువులకన్నా హీనంగా చూస్తారు- ఈ రెండ్రోజులు వారిని కొడుతూనే ఉన్నారు- చిత్రహింసలు పెడుతూనేవున్నారు. ఇంతవరకు వారికి కావలసిన సమాచారం అందలేదట- అందుకే మరికొందరిని పట్టుకొస్తున్నారు. ఇందులో డాక్టర్లు అధ్యాపకులు, లాయర్లు, విద్యార్థులు, కార్మికులు వున్నారు.

'ఎందరు ఎన్నిరకాల చిత్రహింసలకు గురిచేయబడ్డా, నమ్మిన ఆశయానికి కట్టుబడి, ఉద్యమానికి ద్రోహం చేయకూడదు; ఇది అందరి ఉద్దేశంగా కనపడింది-

అక్కడికి తీసుకురాబడ్డ అందరిపై ఏవో కొన్ని అభియోగాలు మోపారనీ, చిత్రహింసలకు తట్టుకోక కొందరు కొన్ని ఒప్పుకున్నారనీ తెలిసింది-

724

'ఈ వారిని ఎందుకు తీసుక వచ్చారు?'

'ఇతని అన్న తప్పించుకపోతె ఇతన్ని పట్టుక వచ్చిండ్లు సార్'.

ఇంతలో భోజనానికి పిలుపు వచ్చింది. అందరు అరుగులపై కూర్చున్నారు. ముందర ఆకులువేసి అందులో అన్నం పెట్టారు. దాన్ని అన్నం అనేకంటె నానవేసిన బియ్యం అంటే సరిపోతుంది, వాచిపోయిన చేతిని, ఆ వేడి బియ్యంపై కాపాను. చాలా హాయి అనిపించింది. ఈరోజు పొందిన ఆనందమంతా అదే. కొందరు ఆకుల ముందు కూర్చోలేక పోతున్నారు. కొందరి చేతులు అన్నం కలుపలేని స్థితిలో ఉన్నవి. కొందరు నిలబడలేరు– మరికొందరు కూర్చోలేరు– వారందరితో పోల్చుకుంటే అందులో చాలామందికంటే నేనే మెరుగ్గా ఉన్నాననిపించింది. ఆ ఆహారంలో నీరులాంటి చారు పోశారు. వాటికి తోడుగా అందరికీ గ్లాసెడు నీళ్ళుపోశారు. కొందరు తినలేక తిన్నారు– కొందరు తినలేదు– మరికొందరు తినవీలులేక తినలేదు– ఎట్లయితేం భోజనాల కార్యక్రమం ముగిసింది– అందరిని అదే పెద్ద హాలులోనికి తోలారు.

అందులో ఒక విద్యార్థి ఒక సిగరెట్టు ముట్టించిండు. తలో దమ్ము లాగారు.

ఒక విద్యార్థి నా చెవిలో గుసగుస చెప్పాడు. అందులో ఒకతను పోలీసు ఇన్‌ఫార్మర్ ఉన్నాడట. ఒక మూలకు కూర్చున్న ఎర్రచొక్కావాన్ని చూపించాడు. అందరిలో వెలివేయబడ్డట్టు ఒంటరిగా ఉన్నాడు.

"సబ్ బైఠో గింతీ కర్నా హై" ఒక పోలీసు మమ్ములను ఆజ్ఞాపించాడు.

అందరం అట్లే చేశాం.

"...సాఠ్, ఏక్‌సట్, బాసట్" మా అందర్నీ లెక్కపెట్టాడు.

"కిత్నె ?"

"ఖాసట్"

"ఔరేక్ సాలా కిధర్ గయా ?"

"ఔరేక్ దఫా గినో"

"ఏక్, దో... ఖాసట్"

"తోటల్ ఫిర్ దేఖోజి"

"ఇవ్వాలొచ్చినోంతోటి తిర్‌సట్"

"బద్మాష్ ఔరేక్ కిధర్ గయా ?" అంటూ బూతులు తిడుతూ పెట్రోమాక్స్ లైటు వెలుగులో మరో రెండుసార్లు లెక్కపెట్టారు.

వాళ్ళ లెక్కకు అదె అరవయి ఇద్దరు వస్తున్నారు.

725

అంతలో విజిల్స్ మ్రోగినవి. బూట్లు టకటక శబ్దం చేసినవి. కొన్ని మా ముందున్నవి. మరికొన్ని టార్చీలు, పెట్రొమాక్స్ లైట్లు పట్టుకొని అడవిలోనికి తుపాకులతో పోయినవి.

ఏమి జరిగిందో మా అందరికీ తెలుసు. ఎవరు తప్పించుక పోయారో తెలియటం లేదు.

ఒక పోలీసుఆఫీసర్ లిస్టుతెచ్చి అందరి పేర్లుపెట్టి వరుసగా పిలిచాడు. అరవయి ముగ్గురు సరిగానే ఉన్నారు. ఇంతమంది కానిస్టేబుల్స్ కనుక్కోంంది తను కనుక్కున్నందుకు చిరునవ్వు నవ్వాడు. ప్రక్కవానికి ఏదో సైగచేశాడు. విజిల్ శబ్దం అయింది. బూట్లు తిరిగి శబ్దం చేసినవి. హెడ్ కానిస్టేబుల్ మళ్ళీ లెక్కపెట్టాడు. లెక్క సరిపోయింది. ఆ ఆఫీసర్ వాళ్ళందరినీ వారితెలివితక్కువ తనానికి బండబూతులు తిట్టి పోయాడు.

ఆ హెడ్‌కానిస్టేబుల్. చిన్న కానిస్టేబుల్‌ను పట్టుకొని "ఆ తప్పించుక పోయిన మాకేలవుడగాడు ఎక్కడినుంచి వచ్చిండు ?" అని అడిగాడు.

"వో కోన్‌హై సాలా" అంటూ మా అందరి ముఖం చూశాడు. దేశంలోగల కష్టజీవులకూ, విద్యార్థులకూ ఈ రకంగా పోలీసులవల్ల అవమానం జరుగుతుంటే 'నా ప్రజాస్వామ్యం చూడు, నా ప్రగతి చూడు' అంటూ పాటలు పాడే కవులను ఏమనుకోవాలి ?

ఏమాత్రం ఎదురించినా పరిణామం ఏమవుతుందో అందరికీ తెలుసు. అందుకే ఎవరూ ఏమీ పలుకలేదు. ఇంటరాగేషన్ ఈరోజుకు అఖరన్నట్టు దభేల్‌న తలుపుపెట్టి తాళం వేశారు.

అసలు జరిగిందేమంటే చారి జ్వరంతో నిద్రపోయి అన్నానికిరాలేదు. భోజనాల పిమ్మట గోడ ప్రక్కగా నిద్రపోయిన చారిని అనుకొని అందరూ కూర్చున్నారు. అందుకే అతను పోలీసులకు కన్పడలేదు.

'రాత్రి బయటకు పోవలసివస్తే ?'

"మూలకు ఒక కుండ పెట్టిండ్లు. బయటకు ఎవ్వరిని ఒదిలిపెట్టరు సార్"

గదిలో చిన్నగా మాటలు బయలుదేరినయ్.

"అందర్ కోయి నయ్ బాత్ కర్నా" సెంట్రీ గద్దించాడు,

మా పై జరిగే ఈ కిరాతకాన్ని సహించలేనన్నట్టు బయట అడవి గాలి హోరు. మధ్య మధ్యన పెద్దపులుల గాండ్రింపులు. అప్పుడప్పుడు సెంట్రీ కేకలు, రాత్రి ప్రపంచాన్ని జోకొడితే అడవిని మేల్కొలిపింది.

మెదడులో ఎన్నో ఆలోచనలు. రేపు జరుగబోయె ఇంటరాగేషన్‌లో చెప్ప వలసిన విషయాన్ని చాలాసార్లు మననం చేసుకున్నా. ఎప్పుడో కునుకు పట్టింది.

* * *

అందరు ఎప్పుడు లేచారో కాని పోలీసుల కేకలకు మాత్రం నాకు మెలుకువ వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకొనడానికి జట్లు జట్లుగా తీసుకుపోతున్నారు.

ఒకతను నిలబడే దొడ్డికి పోయాడు. ఆ దృశ్యాన్ని చూసి కంపించిపోయాను. అతను కూచోలేనిరీతిగా అతని శరీరం పగిలిపోయింది. పూర్వం బానిస యజమానులు తమ బానిసలను ఇంత అమషంగా హింసించేవారని ఎవరన్నాఅన్నా నేను నమ్మలేను. ఇంతకంటె చెట్టుకు కట్టి కాల్చేస్తే నాకు ఇంత బాధకలిగేది కాదు.

ఎవరైనా 'మనం నాగరికులం, మన సంస్కృతి గొప్పది, మనం అణుయుగంలో ఉన్నాం, ఇంకా ముందున్నాం' అంటూ వాగాడంబరాన్ని వల్లిస్తే అతన్ని తీసుకవచ్చి ఈ దృశ్యంచూపిస్తే అర్థం అవుతుంది, మనం ఏ యుగంలో ఉన్నామో ... రక్తాన్ని చవిచూసిన శార్క్ చేప స్వజాతి దాన్నైనా ముక్కలుముక్కలుగా కొరుక్కతింటుంది. దానికీ యిక్కడ జరిగే హింసకూ భేదం కనపడలేదు నాకు.

తరువాత అందరికీ టీ పోశారు.

"త్వరగా తాగండి. మీకు మరో 'కోటింగ్' పడాలి" లావుగా ఉన్న చిన్న కానిస్టేబుల్ అన్నాడు.

అతని హాస్యానికి, యితర కానిస్టేబుల్స్ పళ్లికిలించారు.

నాకు అసహ్యమేసింది.

పైనుండి క్రిందికి ఒక్కొక్కరికి పిలుపు రాసాగింది. పైకి పోయిన ప్రతివాడి పెడబొబ్బలు క్రిందికి వినబడుతున్నవి. మళ్ళీ హింసాకాండ మొదలయింది.

కొంతసేపటికి నా పేరొచ్చింది.

అతి కష్టంగా పైకి పోయాను.

దృశ్యం ముందుమాదిరిగానే ఉంది. అందరు నావైపు చూసి నవ్వారు. అది విషపు నవ్వు.

"రాత్రి బాగా ఆలోచించుకొని ఉంటావు. నీ లైఫ్ స్పాయిల్ చేసుకోకు. నీవద్దకు యూ.జి. వాళ్ళు ఎవడెవడు వచ్చేవాడు ?"

'నాకు ఎవరూ తెలియదు- ఎవరూ వచ్చేవారు కాదు.'

727

"నీ దగ్గరకు వచ్చినట్లుగా మావద్ద బలమైన సాక్ష్యాలున్నవి."

'అవి ఉండగా నన్ను అడుగుడెందుకు'

"నీ నోట వినాలని."

'నా వద్దకు ఎవరూ వచ్చేవారు కారు' అదే జవాబు తిరిగి చెప్పాను.

"నీదే గ్రూప్ ?"

'నేను ఏ పార్టీకి చెందినవాన్ని కాను. నాది ఏగ్రూపూ కాదు.'

"క్లాసులో... మావో యిజం బోధించావట"

'లేదు'

"గుట్టలపై రాత్రిళ్లు మీటింగ్ ?"

'లేదు

"చారి, ప్రసాద్, సాయిల్ను తీసుకరా !"

మరుక్షణంలో వారు పైకి వచ్చారు.

హైస్కూల్లో వాళ్ళు నా స్టూడెంట్సు. ఇపుడు కాలేజిలో చదువుతున్నారు.

"అరే, వీడు మీకు క్లాసులో మావో యిజం చెప్పాడా లేదా ?"

"......... ..."

"గుట్టలపై రాత్రిళ్ళు మీటింగులు పెడుతాండా లేదా ?"

ఆ ముగ్గురూ ఒకేసారి "లేదం"టూ తలలూపారు.

"లంజకొడుకుల్లారా, ఇన్ని తన్నులు తిని ఇంకా అబద్ధమాడుతార్రా" అంటూ ఆ ఇంటరాగేషన్ చేసే ఆఫీసర్ చారిని కట్టెతో కొట్టాడు. ఆ దెబ్బకు తట్టుకోలేక కింద పడిపోయాడు. ఇంతలో ఆరడుగులపైన ఉన్న ఒక ఎస్.ఐ. వచ్చి 16 సం॥ ఆ పిల్లవాన్ని పిడుకలు చేసేముందు పేడను తొక్కినట్లు తొక్కి తన్నాడు. ఆ చిత్రహింసకు తట్టుకోలేక అతడు స్పృహ కోల్పోయాడు. అతణ్ణి తీసి ప్రక్కకు పడవేశారు. నలుగురు పోలీసులు ప్రసాద్‌ను తలుపుసందులో పెట్టి గట్టిగా నొక్కారు. మరికొందరు చుట్టూ నిలబడి సాయిల్ని ఫుట్‌బాల్ను తన్నినట్లు తన్నారు. తుపాకి మడమలతో గుద్దారు.

వీరు చేసిన నేరం, పోలీసుల కల్పిత అభియోగాలను ఒప్పుకోకపోవడం.

ఇంటరాగేషన్ కొనసాగుతూనే ఉంది.

"అరె, నువ్ ఎప్పుడైనా పోలీసు స్టేషన్‌కు వచ్చినావురా!"

'లేదు'.

728

"అందుకే నీకు పోలీసోల్లంటె భయంలేదురా లంజకొడుక" అంటూ నన్ను క్రింద పడేసి అందరూ కలిసి బూట్లతో తన్నారు. అందులో ఒక తన్ను నా ఎడమ కన్నుకు తాకింది. కొద్దిసేపు ఆ కన్ను కనిపించలేదు. బాగా వాచిపోయింది- తరువాతనన్ను లేపారు- నీచంగా తల్లినీ, భార్యనూ తిట్టారు.

"పిల్లగాండ్లను నీవు గోడకుర్చీ వేయించుతవా?"

'లేదు'.

"అయితె నువ్ గోడకుర్చీవెయ్"

అట్లాచేయక తప్పలేదు.

"సరిగ్గా ఉండు లంజకొడుకా" అంటూ దగ్గరకు వచ్చాడు ఆ ఆఫీసర్.

"బడిలో ఏ సబ్జెక్ట్ చెప్పుతావు?"

చెప్పాను

"పాఠాలు ఉన్నవి ఉన్నట్లే చెప్తవా?"

"అవును ఉన్నది ఉన్నట్టు చెప్పుతా"

"పాఠంలో లేంది ఏదీ చెప్పవా?"

'నేనట్లాచెప్పను.'

"లంజకొడుక, ఇంతింత మీసాలుంటె పోరగాండ్లు భయపడర్రా?" అంటూ నా మీసాలు పీకాడు.

ఇంతలో ఒక పోలీసు ఆఫీసర్ ఏవో కాగితాలు తీసుకొని వచ్చాడు. అదిచూసి ఆ ఇంటరాగేషన్ చేసే ఆఫీసర్ చిరునవ్వు నవ్వి ఈలవేశాడు.

''అరేయ్, మామూలుగ కూర్చో''

అలాగే చేశాను. గోడకుర్చీనుండి విముక్తి అయినందుకు చాలా రిలీఫ్ అనిపించింది.

పెన్నూ, తెల్లకాగితమూ యిచ్చారు. వారు చెప్పింది వ్రాయమంటె వ్రాశాను. నా వ్రాతను వాళ్ళవద్ద ఉన్న కాగితాలలోని వ్రాతతో పోల్చారు.

వాళ్ళ కళ్లు మెరిసినవి.

''ఈ రాత నీదేనా?''

'ఊఁ'

"అయితె నీవు కవిత్వం వ్రాస్తనని చెప్పలేదు"

.....................

729

"అరేయ్ అయితే నువ్ చెప్పనివి చాలా ఉన్నవి"అంటూ ఆ పెద్దపోలీసుఆఫీసర్ నావద్దకు వచ్చాడు. చిన్న పోలీసు ఆఫీసర్ వద్దగల కాగితాలు తీసుకుని

"లంజకొడుక, దేనిమీదరా నువ్ గేయం వ్రాసింది?"

'వియత్నాంమీద'

మాట పూర్తికాకమునుపే బూటుకాలితో నాతలపై తన్నిండు. తూలి క్రింద పడిపోయా- కళ్ళు చీకట్లుకమ్మినవి. మరొకతను నా చేతులపై నిలుచున్నాడు. చేతికున్న గడియారం పగిలిపోయింది.

"నిల్చో బే"

నా చేతులపై నిలుచున్న ఆఫీసర్ నా మెడలుపట్టి పైకిలేపాడు

"బోసిడికే, ఒక్కతన్నుకు పదహారు దిక్కులపడ్తవ్. 'వియత్నాం వీరుడా' అంటూ గేయాలు రాత్తావురా? నీయవ్వను దెం......"

'వియత్నాం పోరాటాన్ని మన ప్రభుత్వం సమర్థించింది. నేనువ్రాస్తే తప్పా?'

"నాకే ఎదురుప్రశ్న వేస్తావుర" అంటూ నా తలను గోడకు గ్రుద్ది "నీపని నువ్ చేస్కోవి ఉక్కతరాగ బతుకక కథలు, గేయాలార నువ్ రాసేది. గవర్నమెంటు నీకు జీతమిచ్చేది చదువు చెప్పుమనా, గేయాలు రాయమనా? ఈ గేయాలువ్రాసి నువ్ సమాజాన్ని మారుస్తావురా? నీ అటువంటి తిన్నింటివాసాలు లెక్కపెట్టే నమ్మక్ద్రాంలను కాల్చిపారెయ్యాలె. మన గవర్నమెంటు చాలా మంచిది. నువ్వనే గవర్నమెంటు వస్తే, గిట్లనివాళ్ళను కాల్చేస్తారు. వాల్లది ఫాసీజం. మనది డెమక్రసిరా. అందుకే నువ్ బతికినవ్..."

ఇంతలో మరొక వ్యక్తిని పైకి తీసుక వచ్చారు.

"వీడేసార్, ఆదర్శ వివాహం చేసుకున్నది"

"ఔనారా?"

"ఊ"

"నీ కులంకాని పిల్లనెందుకు చేసుకున్నవురా. నీ పెండ్లాన్ని దె......"

"నాకు కులాలు మతాలంటె విశ్వాసంలేదు"

"ఓహో నువ్ పెద్ద సంఘ సంస్కర్తవన్నమాట"

"నువ్ ఎప్పుడన్న పోలీసు స్టేషన్‌కు వచ్చినావ్, బే"

"ఇదువారకోసారి ఈ విషయంతోనే తీసుకపోయిండ్లు".

730

"అందుకేరా లంజాకొడుక, నీకు పోలీసోల్లంటె భయంలేదు" అని ఒకృతన్ను తన్నిండు. చేతిలోగల కర్రతో మరో ఆఫీసర్ తలపైకొట్టాడు-

"నీ పెండ్లి ఎవరి ఆధ్వర్యముల జరిగిందిరా?"

అతడు నావైపు చూపాడు.

"ఇకనువ్ పో"

"నువ్ ఆదర్శ వివాహంచేసి సంఘంను చెడగొడ్తానవ్ బద్మాష్ మల్ల నీకేం తెలియదంటవ్".

'మన ప్రభుత్వం ఈ కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తుంది.'

"బోసిడికె, నీ అవ్వను పట్టుక గురాంలు...... ప్రభుత్వం చేస్తుందని నువ్ చేత్తావుర. నువ్వెంత, నీబతుకెంత, సర్కారుకు తెలివిలేదుర. నీతెలివి ఎవనికికావాల్రా?" ఇంకా ఏదేదో వాగుతూనే ఉండు.

"నీగూర్చి మాకు బాగా తెలుసు. నిజం ఒప్పుకోకపోయినవో నిన్ను కాల్చేస్తా. ఐ హావ్ గాట్ ఫుల్ పవర్స్" అంటూ పిస్టల్ నా ఛాతిపై పెట్టాడు.

రెక్కాడినా బుక్కాడని నా ముప్పైఏళ్ళ జీవితంలోని కష్టాలు కలిగించని అవగాహనను నాలోని అస్పష్టమైనభావాలకి ఒక రూపకల్పనని ఈపోలీసు చిత్రహింసలు, నా ఛాతీపై ఉన్న యీ పిస్తోలు కలిగించినవి- నాకు ధైర్యం వచ్చింది.

"మీరు నన్ను కాల్చేసినా, నాపై మోపిన అభియోగం పూర్తిగా అబద్ధం"

"ఇప్పటికి వీన్ని ఒదిలిపెట్టండి సార్" అంటూ నావైపు తిరిగి 'అరే, ఎవడైతె ఏదీ ఒప్పుకోడో వాడే స్టాంగ్ వర్కర్. నువ్ తప్పనిసరి కొన్నైనా ఒప్పుకోవాలి. లేకుంటె నీకిదేగతి. దిస్ ఈజ్ లాస్ట్ చాన్స్ ఫర్ యు. ఇప్పటికి క్రిందికిపో"

పోలీసుకానిస్టేబుల్ నన్ను కిందికి తీసుకవచ్చాడు.

కూర్చోలేని నేను కిందపడిపోయాను. ఒక్కొక్కరినే పైకి తీసుకపోతున్నారు కిందికి తీసుక వస్తున్నారు.

ఇదే తగిన సమయమనుకొని కాబోలు ఆ పోలీసు ఇన్‌ఫార్మర్ నా దగ్గరకు వచ్చి కూచుండు.

"మిమ్ములను బాగా టార్చర్ చేశారా సార్."

ఔనన్నట్లు తల ఊపాడు.

అందుకు తన బాధ వ్యక్తం చేసాడు.

731

"మనం ఎన్ని బాధలుపడ్డా యు.జి. వాళ్ళను గూర్చి చెప్పొద్దు సార్"

'...........'

"ఎస్ కె, జి.కె....వీళ్ళు ఎక్కడున్నసంగతీ మీరు చెప్పొద్దుసార్, చెప్పారా?" అంటూ నా కళ్ళలోకి సూటిగా చూశాడు.

వీడు ఆడే వెధవ నాటకానికి ఒళ్ళు మండింది.

'వీళ్ళు నీకు ఎంత ముట్టజెప్పారు ?'

"దేనికి ?"

'వీళ్ళందరికి చేసే ద్రోహానికి, పోలీసులకు చేసే సహాయానికి'

ఈ నా మాటలకు ఖంగుతిని స్ప్రేడ్‌జాకిలాగ ముఖంపెట్టుకొని "నేను అటువంటి వాణ్ని కాదు" అంటూ గొణుక్కుంటూ నా దగ్గరనుండి లేచిపోయాడు.

మరికొద్ది సేపటికి నావంతు వచ్చింది.

నన్ను తిరిగి పైకి తీసుకపోయారు.

మళ్ళీ అదే దృశ్యం.

"కూర్చో" ఆ పెద్ద పోలీసు ఆఫీసర్ కుర్చీ చూపించాడు.

ఈ విపరీత పరిస్థితి ఆశ్చర్యాన్ని కలిగించింది, వాళ్ళు చేసే పన్నాగం అర్థం కాలేదు.

"మీపై ఉన్న అలిగేషన్స్‌లో ఎన్ని నిజం" కథ మొదటికి వచ్చింది.

'అవన్నీ తప్పే'

"సరె మీరు సంఘ వ్యతిరేక కార్యకలాపాలు ఏవీ చేయలేదంటే ఒప్పుకుంటాం కాని మేము చెప్పే ఒక చిన్న విషయం మీరు ఒప్పుకోవాలి."

'ఏంటది ?'

"కోర్టులో మేము చెప్పినట్లు సాక్ష్యం ఇవ్వాలి" నిదానంగా, మందస్మిత వదనంతో అడిగాడు.

అంటే నేను అప్రూవర్‌గా మారాలి. ఇది వారి పన్నాగం. మానవున్ని మానవుడు దోచే వీలులేని సమసమాజ స్థాపనకై ఎందరో మహానుభావులు సుఖాలను ఒదులుకొని కష్టాలను ఆహ్వానిస్తే వారికి వ్యతిరేకంగా, దోపిడీ ప్రభుత్వానికి అనుకూలంగా సాక్ష్యం చెప్పేవాడు ప్రజాద్రోహి. ఆ ద్రోహానికి పాల్పడిందానికంటే, శత్రువు గుండుకు ఎరయై పోవడం మేలు. అప్రూవర్‌గా మారినవాణ్ణి చైతన్యవంతమైన సమాజం ఎన్నడూ క్షమించదు.

ఈ రకమైన ఆలోచన నా మెదడులో కదిలింది.

"బాగా ఆలోచించుకో. నీకు ఉద్యోగముంటుంది. నీవు బీదవాడి వంటానవ్ కదా. నీకు డబ్బుకూడ ఇస్తాం, సరేనా. ఇదిగో ఈ సిగరెట్ తాగు" అంటూ సిగరెట్ ఇవ్వబోతే అలవాటు లేదన్నా.

"మాకు అనుకూలంగా లేకపోతే దాని పర్యవసానం ఏమవుతుందో నీకు బాగా తెలుసు. ఊఁ ఏమంటవ్."

'మీరు ఏంచేసుకున్నా బాధలేదు నాకు ఎవరూ తెలియదు. మీకు అనుకూలంగా సాక్ష్యం ఇవ్వలేను.'

నా మాట పూర్తి అవడం, అతని తన్నుకు నా కుర్చీ అల్లంత దూరాన పడిపో వడం ఒకేసారి జరిగినవి.

"ఈ మొండి లంజాకొడుకు వినడు. వీన్ని తీసుకెళ్ళండి."

నన్ను తిరిగి పెద్ద హాల్లోకి తీసుక వచ్చాడు ఓ కానిస్టేబుల్.

మేడపై పోలీసులు వారి పైశాచిక చర్యలను జరుపుతూనే ఉన్నారు. దెబ్బలు తిన్న వారి శరీరాల నుండి కారిన వేడి రక్తకాంతులకు సూర్యుని ముఖం ఎర్రపడింది. ఈ దృశ్యాన్ని ఇక చూడలేనంటూ సూర్యుడు తెరమరుగయిండు. అక్కడ జరిగే చిత్రహింసలకు మేఘాలు గర్జించినవి. అడవిలో మెరుపు దాడి జరిగింది. ప్రకృతి మాత కన్నీరు కార్చింది. భీభత్సంగా మారింది.

'కుఁయ్' మంటూ ఒక జీపు మా హాలు ముందు ఆగింది.

నన్నూ, ఇద్దరు డాక్టర్లనూ, మరొక టీచర్‌నూ అందులో కూర్చోమని ఆజ్ఞా పించారు.

సాయుధులైన రిజర్వు పోలీసులు మా చుట్టూ కూర్చోగా, ముందు సీటులో పోలీసు ఆఫీసర్‌తో మా జీపు అడవిలో తార్‌రోడ్డుపై బుల్లెట్‌లాగ దూసుకపోతూంది.

మేము ఎటు తీసుకొని పోబడుతున్నామో మాకు తెలియదు.

"మమ్మలను ఇప్పుడు ఎక్కడికి తీసుకుపోతున్నారు ?" ఆతురుత ఆపుకోలేని ఒక డాక్టర్ అడిగాడు.

అందుకు సమాధానంగా డ్రైవర్ హారన్ చప్పుడు చేశాడు.

చాలా రాత్రికి ఊరి చివరగల ఒక ఇంటిలోకి చేరాము.

733

చిన్న గది. అందులో నలుగురం. గదిలో చీమల పుట్టలు. కటిక చీకటి. మా గది చుట్టూ పోలీసు బందోబస్తు.

రోజులు గడుస్తూనే వున్నాయి.

ఒక రోజు "మమ్మల్ని ఎందుకు ఇక్కడికి తెచ్చారు" టీచర్, కానిస్టేబుల్‌ను అడిగాడు.

"లంబ్డీకొడుకులు పై ఆఫీసర్లవద్ద మంచోడనిపించుకొని ప్రమోషన్ కొట్టె య్యాలని అప్పుడప్పుడు ఇట్లనే చేస్తుంటరు సార్. ఇందులో గూడ డబ్బిచ్చినోల్లను రెకమెండేషన్ ఉన్నోల్లను ఒదిలిపెడ్తరు. అట్ల చేయనోల్లను గిట్లనే చేసి చివరకు ఏదో కేసుల యిరికించి జైల్లో పడేస్తరు" అంటూ చెప్పాడు.

అన్నట్లే ఆపై వారంరోజుల్లో నాలుగు పోలీసు స్టేషన్లు తిప్పి ఒకరోజున మమ్ముల్ను అంతరంగిక భద్రతా చట్టంక్రింద సెంట్రల్ జైల్లో పెట్టారు.

రెండు సంవత్సరాల కారాగార శిక్ష అనుభవించి బయటపడిన తరుణంలో నైజీరియా ప్రముఖ కవీ, నాటక రచయితా అయిన వోల్ సోయంకె అన్నట్లు "జైలులోకి వెళ్ళేముందు కంటే జైలు నుంచి బయటపడిన తర్వాత నా విశ్వాసాలు అభిప్రాయాలు మరింత దృఢమైనవి."

జైలులోకి అడుగుపెట్టగానే పై మాటలు గుర్తుకు వచ్చినై.

త్వరలో వెలువడుతోంది

విరసం త్రైమాసిక

అరుణ తార

నాలుగు సంచికలు పది రూపాయలు

వివరాలకు :

కార్యదర్శి,

విరసం, 10-6-27, కావలి-1.

734